క్లుప్తంగా

నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో రూ. 1.70 కోట్లతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని బుధవారం తహసీల్దార్ జీకే మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాస్తు పూజలు నిర్వహించారు. ప్రజలకు అందుబాటు ఉండి పారదర్శకంగా సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ఐ వెంకటేష్, శ్రీనివాసులు, నాగరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి, శివుడి విగ్రహాలను ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తికావడంతో బుధవారం దేవస్థాన ప్రాంగణంలో హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి సోదరులు జగదీశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి ఎండీ సాధిక్ ఖోఖో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న వంటలను పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కేజీబీవీలో వంట గదులు, కూరగాయాలు, బియ్యం, పరిశీలించారు. అనంతరం విద్యార్థుల యొక్క చదువు, సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ లత పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఆచారి



కల్వకుర్తిరూరల్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బుధవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, స్వామి వివేకానంద సేవాబృందం అధ్యక్షుడు శివలు మర్యాదపూర్వకంగా కలిశారు. సామాజిక సేవా రంగంలో శివ చేస్తున్న కార్యక్రమాలను కేంద్రమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ఒకే దేశం, ఒకే ఎన్నికలు కరపత్రాన్ని విడుదల చేశారు.

సారా స్వాధీనం ఒకరిపై కేసు నమోదు

బల్మూర్: మండలం గోదల్ గ్రామ సమీపంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న సారాను స్వాధీన పర్చుకొని నర్సాయపల్లికి చెందిన లావుడ్యా రామ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై 11 లీటర్ల సారాను తరలిస్తుండగా గమనించి పట్టుకున్నారని సీఐ తెలిపారు. సారాతో పాటు వాహనాన్ని స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వ్యక్తి అరెస్టు రిమాండ్

అమ్రాబాద్: వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని అరెస్టు రిమాండ్ చేసినట్లు బుధవారం సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని కల్ములోనిపల్లిలో ఈ నెల 11న కల్ముల చిన్నబాలయ్య, మధులు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో చిన్నబాలయ్య తీవ్రంగా గాయపడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 14 మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడు కల్ముల మధును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

చలికాలంలో వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయి

- ప్రొఫెసర్ డా. సూర్యనారాయణ, ప్రభుత్వ మెడికల్‌కళాశాల, నాగర్‌కర్నూల్





నాగర్‌కర్నూల్ క్రైం: చలికాలంలో వ్యాధులు త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచనల ప్రకారం జాగ్రత్తలు పాటించాలి. వచ్చే సంక్రాంతి పండుగ వరకు చలితీవ్రత రోజు,రోజుకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. చలికాలంలో రోగాలు త్వరగా ప్రభలడంతో పాటు వైరల్ ఫీవర్లు, స్వైన్ ఫ్లూ, న్యుమోనియా, హార్ట్ ఎటాక్‌లు, బ్లడ్ ప్రెషర్, మెదడుకు సంబంధించి పెరాలసిస్ స్ట్రోక్స్, ఆస్తమా వంటి వ్యాధులకు గురయ్యే ఆస్కారం ఉంది. చలికాలంలో వాతావరణంలో తేమ తగ్గిపోవడం వల్ల చర్మంలో పగుళ్లు రావడం, సీజనల్ వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు దూరప్రాంతాల ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. అత్యవసర సమయంలో బయటకు వెళ్లేటప్పుడు ఉన్ని దుస్తువులను ధరించాలి. సింథటిక్‌తో తయారు చేసిన దుస్తువులను ధరించడం వల్ల శరీరానికి వేడిని అందించి చలి నుంచి రక్షణ పొందవచ్చు. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు విటమిన్ సీ ఉండే పదార్థాలు, పండ్లు, ఆకుకూరలు, సిట్రస్ ఫ్రూట్‌లను తీసుకోవాలి. శీతలపానియాలు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉండాలి.

రాత్రివేళలో దూర ప్రయాణాలు వద్దు

- చిన్నబాలు, జిల్లా రవాణాశాఖ అధికారి, నాగర్‌కర్నూల్





నాగర్‌కర్నూల్ క్రైం: చలికాలంలో వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా కండిషన్‌లో ఉంచుకునేలా చూసుకోవాలి. తెల్లవారుజామున మంచుతీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ముందు వచ్చే వాహనాలు కన్పించవు. ప్రమాదాల భారిన పడే అవకాశం ఉంటుంది. ఫోర్‌వీలర్, ద్విచక్రవాహనాలు వాహనాలను నడిపే వారు పగటి, రాత్రి సమయంలో లైట్లను తప్పనిసరిగా వేసుకుని వాహనాలు నడపాలి. తెల్లవారుజామున, రాత్రి సమయంలో దూరప్రయాణాలు చేయకపోవడమే మంచిది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, ఉన్ని దుస్తులు తప్పనిసరిగా ధరించాలి. మంచు అధికంగా ఉంటే కొంత సమయం సమీపంలో విశ్రాంతి తీసుకోవాలి. కొండప్రాంతాల్లో చలి అధికంగా ఉంటుంది. మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి. కొంచెం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలబారిన పడతారు. ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలను కండిషన్‌లో ఉంచుకోవాలి. ఫోర్‌వీలర్, టూవీలర్లను ఎక్కువ రోజులు ఆపకుండా తరుచుగా నడపుతూ ఉండాలి.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కల్వకుర్తిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండలంలోని కుర్మిద్దలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను సర్వే చేశారు. మండలంలోని కురిమిద్దలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి, జూపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. ప్రత్యేక యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య గౌడ్,నాయకులు పర్వతాలు తదితరులు ఉన్నారు.



చారకొండ మండలం చంద్రాయన్‌పల్లిలో ఇళ్ల సర్వేలో అధికారులు

మన్ననూర్: గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భీముడు, సిబ్బంది సురేష్, మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు, సీబీతండాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ మోహన్‌లాల్ పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న శక్తికేంద్ర ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి

వెల్దండ: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని శక్తికేంద్ర ఇన్‌చార్జ్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అజిలాపూర్‌లో 140, 141 బూత్ కమిటీల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, మల్లేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామీణ ప్రజల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలను అమలుచేస్తున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు ఇంటింట సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, రాజేందర్‌రెడ్డి, పెద్దయ్యగౌడ్, నిరంజన్‌గౌడు, శేఖర్, రమేష్, రాజు తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, పాలకమండలి సభ్యులు, దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. బుధవారం భోగమహేశ్వరంలోని పంచలింగాల రాజగోపురం పనులను పరిశీలించారు. సంక్రాంతి వరకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కల్యాణ మండపం పూర్తి కావొస్తుందన్నారు. జనవరిలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



భోగమహేశ్వరంలోని రాజగోపురం పనులు పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

తిమ్మాజీపేట: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో పాటు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏఈఓ సాయిరాంలు రైతులకు సూచించారు. మండలంలోని మారేపల్లిలో బుధవారం వర్మీకంపోస్టు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్టు తయారువిధానాన్ని వివరించారు. ఏపీఓ సత్యనారాయణ, ఎస్‌బీఐ అధికారి, రైతు కూలీలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోవడంపై ఆగ్రహం

అమ్రాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమపథకాలకు దరఖాస్తున్నప్పటికి తమ పేర్లను అధికారులు నమోదు చేయలేదని మండలంలోని తిర్మలాపూర్(బీకే)గ్రామానికి చెందిన రమేష్, తిరుపతయ్య, అశోక్ తదితరులు బుధవారం స్థానిక విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం పరిశీలించగా కొందరు పేర్లు లేవని వారు ఆరోపించారు. మొత్తం వంద మంది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేయలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను వివరణకోరగా ఆన్‌లైన్ నమోదు చేస్తున్న ఆపరేటర్‌కు సర్వే పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు.


పెంట్లవెల్లికి చేరిన పాదయాత్ర



పెంట్లవెల్లి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జోగులాంబ దేవాలయం నుంచి ఉమామహేశ్వరం దేవాలయం వరకు శావార్చక విజయ్‌కుమార్ చేపట్టి బాపుబాట సత్యశోధన పాదయాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు పెంట్లవెల్లి ఆర్యవైశ్య సంఘం మిత్రులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ 100 రోజులు 1000 కిలోమీటర్ల లక్ష్యంగా పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జీవితం అందరికి ఆదర్శమన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం వారు ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో శీను, రవి, వెంకటేశ్వర్లు, సత్యం, రాకేష్, యాదయ్య, ప్రసాద్, శివ, శ్రీకాంత్, నవీన్‌లు పాల్గొన్నారు.

లగచర్ల ఘటనపై బీఆర్‌ఎస్ రాజకీయ రాద్ధాంతం

తిమ్మాజీపేట: లగచర్ల ఘటనపై బీఆర్‌ఎస్ నాయకుల ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా ఇండస్ట్రీస్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేక అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే రైతులను రెచ్చగొట్టి జిల్లా కలెక్టర్‌పై దాడి చేయిస్తే ప్రభుత్వం ఊరుకోవాలా అని వారు ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో ప్రజలు బుద్ధిచెప్పినా బీఆర్‌ఎస్ నాయకులకు తీరు మారలేదన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి మాధవులు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు దానం బాల్‌రాజ్, ఉస్మాన్, లక్ష్మీనారాయణ, ఎల్లారెడ్డి, వెంట్రామ్‌లు, నాగసాయిలు, జమీర్, రమేష్, శ్రీశైలం, బంగారు, మల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వాల్ పోస్టర్ల విడుదల



అచ్చంపేట రూరల్: ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించే బస్సుజాతకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గౌరవ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, శివలీల, నిర్మల, లక్ష్మి, పార్వతమ్మ, అలివేల, బాలమణి, సాయిలమ్మ, శ్యామల, మంగమ్మ పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ప్రత్యేక పూజలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ వరకు ప్రతిరోజు ఉదయం సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాకాలం, ప్రత్యేక భజనలు నిర్వహిస్తునట్లు ఆలయ పూజారి కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారు కృపాకటాక్షం పొందాలని కోరారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

తాడూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బ్రహ్మచారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరిగతిన పూర్తిచేయాలన్నారు. స్థానిక సంస్థ పోలింగ్ కేంద్రాల వివరాలు, డేటా ఎంట్రీ, నర్సరీ బ్యాక్ ఫిల్లింగ్ ప్రైమరీ బెడ్స్, రోడ్డు పక్కన మొక్కలకు పాదులు, ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయుట, పన్నుల ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రసిద్ధార్థ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచితంగా దుస్తులు కుట్టడం గొప్పవిషయం



నాగర్‌కర్నూల్‌రూరల్: అనాథ పిల్లలకు ఉచితంగా దుస్తులు కుట్టించి పంపిణీ చేస్తున్న ఉదయ్ టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులను ఐసీడీఎస్ జిల్లా అధికారి రాజ్యలక్ష్మి బుధవారం అభినందించారు. జిల్లా కేంద్రంలో నిర్వాహకులు జెల్లి ఉదయ్‌కుమార్‌తోపాటు శేఖర్, వాసుదేవ్ తదితరులకు మెమెంటోలు అందజేసి సన్మానించారు. ప్రతిఒక్కరూ సేవదృక్పథం అలవర్చుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో బుధవారం బానవత్ కేస్లీ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. తిమ్మినోనిపల్లిలో సామ పుల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.3వేలు, బీఆర్‌ఎస్ నాయకులు గంటి కోట రాజు రూ.2వేల చొప్పున అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఉడుత పార్వతమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు రూ.5వేల ఆర్థికసాయం అందజేసి ఓదార్చారు.

అక్రమ అరెస్టులు సరికాదు

అచ్చంపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టులు సరైంది కాదని సీఐటీయూ జిల్లా నాయకుడు రాములు, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి జీఓ నెంబర్ 60ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27, 28 తేదీలలో సమ్మెను చేపడుతున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 1నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు వేమయ్య, కార్యదర్శి మద్దెలబండ బాలస్వామి, వెంకటేష్, నాసరయ్య, బాలయ్య, రామచంద్రయ్య, విష్ణు, కిష్టయ్య, పద్మమ్మ, ఈశ్వరమ్మ, సరిత, హుస్సేన్, పార్వతమ్మ, బుజ్జమ్మ, పద్మమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



అచ్చంపేటలో నిరసన చేపడుతున్న పంచాయతీ కార్మికులు

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు

లింగాల: బాల, బాలికల హక్కులకు ఎవరైన భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి వర్క్ షాపును నిర్వహించారు. పిల్లల అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధమన్నారు. బాల్య వివాహాలు చేస్తే కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంఈఓ బషీర్ అహ్మద్, ఆర్ఐ సీతారాంనాయక్, ఎంపీఓ చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, సఖి లీగల్ సలహాదారులు సరిత, వైద్యాధికారి ప్రశాంత్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

దుప్పట్ల పంపిణీ

మన్ననూర్: స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో దివ్యాంగులకు, ఆర్టీటీ ఆస్పత్రి సిబ్బందికి, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆ సంఘం అమ్రాబాద్ అధ్యక్షుడు పాత్లావత్ జోగారాం బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆర్టీటీ ఆస్పత్రికి వచ్చిన చెంచులకు దుప్పట్లు అందజేశారు. దాతను ఆర్టీటీ వైద్యాధికారి సైపుల్లాఖాన్, గ్రామ కార్యదర్శి భీముడు అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు రామ్మోహన్, ప్రసాద్, తిరుపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు..

నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని చెంచులకు హైద్రాబాద్‌కు చెందిన శివ రాచర్ల, వివేక్‌రెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో బుధవారం రగ్గులు పంపిణీ చేశారు. మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్ తదితర పెంటలకు చెందిన 75 కుటుంబాలకు రూ. 32 వేల విలువ చేసే ఉలన్ రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో వివేక్ లంకల, మధన్‌రెడ్డి, మహేష్, సీనియర్ జర్నలిస్టు చారగొండ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జోగారాం

అనాథలకు..

అనాథలకు, నిరాశ్రయులకు బుధవారం గ్రామానికి చెందిన మహమ్మద్ మన్సూర్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలోని 8 మంది అనాథలకు రూ.1000 విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు.

నోట్ పుస్తకాల వితరణ

లింగాల: మండలంలోని పద్మన్నపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన పలకలు, పెన్నులు, నోట్ పుస్తకాలను బుధవారం విద్యార్థులకు ఎస్ఐ నాగరాజు అందజేశారు. పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని కోరారు. పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని గ్రామస్తులను కోరారు. మాజీ ఎంపీపీ లింగమ్మ, నాయకులు రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, వెంకట్రాం, హతిరాంనాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులతో క్రీడా పనులు



కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో క్రీడలకు సంబంధించిన పనులు చేయించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీలకు సంబంధించిన జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఎంపికలలో భాగంగా క్రీడా కోర్టుల కోసం పట్టణంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థులతో సున్నపు గీతలను వేయించారు. విద్యార్థులతో పనులు చేయించడంపై స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్‌ను వివరణ కోరగా సమాచారం తెలువదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

వేతనాలు చెల్లించాలని వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాటన్ దుస్తువులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మధు, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరిగిరిలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకుడు భరత్ కుమార్ యాదవ్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం దాతను గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మన్ననూర్: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచేవిధంగా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

మనోభావాలను దెబ్బతీయొద్దు

అమ్రాబాద్: దళితుల మనోభావాలు దెబ్బతినే విధంగా కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేశారని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందమల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధకరమని పేర్కొన్నారు.